


# ముసి ముసి దెయ్యం...

పి.వి.రామకృష్ణ

**బయటంతా భోరున వర్షం. ఎవరో కుండల్తో ముంచి పోస్తున్నట్లుగా కురుస్తోంది. కిటికీ దగ్గరకొచ్చి మరోసారి బయటకు చూశాడు వశిష్ట. పెద్ద వర్షం. బాణాల్లాంటి చినుకుల మధ్య నుంచి దూరంగా అందమైన పెంకుటిల్లు.**

**అతడు తన గదిలో వుండే సమయమంతా ఆ ఇంటివైపే చూస్తూ గడుపుతాడు. వాళ్లుండే ఆ అపార్ట్‌మెంటు ఆ కాలనీలో కెల్లా పెద్దది. పైగా అది అన్నిటికన్నా పైన ఫ్లోర్. అందుకే ఆ కిటికీలోంచి చూస్తే రెండు సందుల అవతల ఉన్న ఆ చిన్న ఇల్లు కూడా స్పష్టంగా కనిపిస్తోంది.**

అతని స్నేహితులంతా కంప్యూటర్లలో ఛాటింగ్‌లు, గేమ్స్ ఇలాంటి వాటిల్లో బిజీగా వుండేవాళ్లు. అతడు మాత్రం తన గదిలో కూర్చుని చదువుకుంటూ, మధ్య మధ్యలో ఆ ఇంటివైపు చూడడంతో ప్రారంభించిన ఇంజనీరింగు ఆ ఇంటి వైపు చూస్తూ, మధ్య మధ్యలో చదువుకోవడంతో పూర్తిచేశాడు. ఇప్పుడో ఇంజనీరింగు కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నా ఆ ఆకర్షణ ఇంకా పోలేదు.

అయిదేళ్లుగా చూస్తూండడం అంటే మాటలు కాదు. ఆ ఆకర్షణ కీ కారణం వుంది. అతనికి ఆ ఇల్లంటే ముచ్చట, ఇష్టం.

సిటీ కల్చర్-కాంక్రీటు బిల్డింగుల మధ్య మామూలు ఇల్లు. ముందు మండువా వాకిలి. ఆ వాకిట్లో కనిపించే ముచ్చటైన ముగ్గురు.

వీటన్నింటినీ మించి-

ఆ ముగ్గులేసే ముగ్ధమైన ఓ అమ్మాయి ''బయటకొస్తే బాగుండు'' అనుకున్నాడు. అయినా ఇంత వర్షం కురుస్తోంటే ఆ పిల్ల బయటకెందుకొస్తుందీ? రాదు.

రాదా!?

వస్తే బాగుండు.

రామకోటి లాగా అతడు ఈ 'వస్తే బాగుండు' అన్న వాక్యాన్ని ఎన్నో సార్లు మననం చేసుకుంటూంటాడు. రోజూచూస్తున్నా, అయిదేళ్లుగా అతన్ని అలా కిటికీ దగ్గరే కట్టిపడేస్తున్నా, ఆ అమ్మాయి పేరు కూడా అతనికి ఇంతదాకా తెలియదు.

మొదట్లో - ఆమెను చూసిన కొత్తల్లో, ఆ అమ్మాయి వేసే ముగ్గుల్ని చూసి ఆమెను 'రంగవల్లిక' అనుకునేవాడు. కానీ అంత గంభీరమైన పేరు అస్సలు బాగోలేదనిపించి దాన్ని 'ముగ్గమ్మాయి'గా మార్చుకున్నాడు. ఆ తరువాత చాలా కాలానికి ధైర్యం చేసి ఆ సందులోకి వెళ్లి అటుగా వెళుతున్న పదేళ్ల పిల్లవాడిని పిలిచి, ''ఆ ఇంట్లో వుండే అక్క పేరేంటో తెలుసా?'' అని అడిగాడు.

వాడు కొంత అమాయకంగా చూసి ''ఏ ఇల్లు.. ఎవరు?'' అన్నాడు.

చూపించాడు వశిష్ట. ''అదిగో- ఆ బంతి మొక్కలున్నాయే-పెంకుటిల్లు. అందులో వుండే అక్క పేరేంటి? చెపితే నీకు చాక్లెట్ ఇస్తాను'' ఫైవ్ స్టార్ చాక్లెట్ చూపించాడు.

కుర్రవాడిలో కదలిక కనిపించింది. ''చెప్తాను ఇవ్వు'' అన్నాడు.

వశిష్ట ఇవ్వలేదు. "ముందు చెప్పు. ఆ అక్క నీకు తెల్సా? మంచి అమ్మాయేనా?" అని అడిగాడు.

"ఆ అక్క నాకు బాగా తెల్సు. నేను రోజూ వాళ్లింట్లోనే ఆడుకుంటాను. అక్క చాలా మంచిది చాక్లెట్టివ్వు"

"ఒరి నీ చాక్లెట్టు కాకెత్తుకెళ్లా. ఇది నా జీవితం రా బాబూ"అనుకున్నాడు.

"చాక్లెట్ ఇస్తాను నాన్నా. మరి... అక్క పేరేంటి?" గారంగా అడిగాడు.

"నిన్ను చూస్తే చాక్లెట్లు ఇచ్చేలా లేవు" అన్నాడు వాడు. "ముందు చాక్లెట్ ఇవ్వు. ఇవన్నీ చెప్పాక నువ్వు చాక్లెట్ ఇవ్వకపోతే!?" నా జీవితం ఏం కాను? అన్నట్టు అన్నాడు.

తనకన్నా వాడు గట్టివాడని అర్థమైంది. వాడికి తన పరిస్థితి అర్థం కావట్లేదు. అవసరం తీరాక ఆశ పెట్టిన ఐదురూపాయల చాక్లెట్టుని తనే తినేస్తాడని అనుకుంటున్నాడు.

"నాన్నా...చిన్నా..తీసుకో... ఇదిగో చాక్లెట్టూ... ఇప్పుడు చెప్పు నాన్నా. అక్క పేరేంటి? వాడు చాక్లెట్టు జేబులో పెట్టుకుని "రాంబాయమ్మ" అనేసి నాలుక బయటపెట్టి "వ్వె..వ్వె..వ్వె" అని వెక్కిరించి పరిగెట్టాడు.

"ఒరి వెధవా వస్తున్నా వుండు" అంటూ వెంటపడ్డాడు వశిష్ట.

ఆ తరువాత అతడు ఆ 'ముగ్గమ్మాయిని' ఒక స్నేహితుడి ఇంట్లో జరిగిన బర్త్‌డే పార్టీలో చూశాడు. పుట్టినరోజు ఏడాది పిల్లవాడిది. బాబు భలే ముద్దుగా వున్నాడు. అందరూ ఎత్తుకుంటున్నారు. అతడు కూడా దగ్గరకు వెళ్లి ఎత్తుకోబోయాడు. ఇంతలో పక్కనుంచి "హాయ్...చిచ్చా" అని వినిపించింది. అటుతిరిగాడు. "ఏరా నాన్నా? హాయ్ చెప్పాగా... షేక్ హ్యాండ్ ఇవ్వవా?" అంటోందా అమ్మాయి బాబుని చూస్తూ.

ఆమెను అంత దగ్గరగా చూడడం అదే మొదటిసారి. ఆ స్వరం అంత తియ్యగా వుంటుందని అస్సలు ఊహించలేదు. వేణువు పలికినట్టయింది. అతడు మంత్రం వేసినవాడిలా నిల్చున్నాడు. అతని వైపు రాబోయిన బాబు ఆమె చేతుల వైపుకి వెళ్లాడు.

ఆమె కాసేపు వాడిని ముద్దు చేసి అతనికి అందించింది.అతడు అప్రయత్నంగా బాబుని చేతుల్లోకి తీసుకున్నాడు. కానీ వాడు రావట్లేదు.

ఆమె వాడిని చివరగా గట్టిగా ముద్దు పెట్టుకుని వశిష్టకి ఇచ్చేసింది. అక్కడినుంచి కదులుతుండగా వెనక నుంచి పొడవాటి జడను పట్టుకున్నాడు బాబు.

ఆమె ".... అబ్బా" అంటూ జడను పట్టుకొని వెనక్కి తిరిగింది.

వాడు జడను వదల్లేదు. ఆమె బ్రతిమాలుతున్నట్లు "వదల్రా...ప్లీజ్ రా" అంది.

వశిష్ట స్థాణువులా నిలబడ్డ వాడల్లా కదిలి ఏదో లోకంలో ఉన్నవాడిలా బాబు చేతిని ఆమె జడ నుంచి తప్పించాడు. ఆమె జడను చేతుల్లోకి తీసుకొని సిగ్గుపడుతూ సరిచేసుకుంది. వశిష్ట విచ్చిన కన్నుల్తో చూస్తున్నాడు.అంత వరకూ బాగానే వుంది.

ఇంతలో వాడికి వశిష్ట మీద పట్టరాని కోపం వచ్చినట్టుంది. తన చేతుల్లోంచి అంత మంచి జడను లాగేస్తావా అన్నట్లు చూసి, కసి తీర్చుకుంటున్నట్లుగా పుసుక్కున వశిష్ట చొక్కా తడిపేశాడు.

వెళుతున్న వాడల్లా ఆగి మళ్ళీ చూస్తే, ఫక్కున నవ్విందామె. ముత్యాలు రాలిన అనుభూతి. మళ్లీ అంతలోనే సిగ్గుపడి నోటికి చేయి అడ్డుపెట్టుకుని ముసి ముసిగా నవ్వింది.

సిగ్గుతో ఎర్రబడిన ముఖంతో "దెయ్యం.." అనుకున్నాడు వశిష్ట. ఎలా నవ్వుతోందో చూడు...

వాడు ఇంకా ఆపలేదు. కసితీరా ఇంకాసేపు పోసాడు. ఇంతలో వాడి అమ్మానాన్న క్లైమాక్స్‌లో పోలీసులొచ్చినట్లు వచ్చి వాడిని తీసుకొని "అయ్యో..సారీ అండీ" అన్నారు.

ఆమె నవ్వు ఆగట్లేదు. అలాగే ముసిముసిగా నవ్వుకుంటూ అక్కడ్నుంచి వెళ్లిపోయింది.

అతడికా రాత్రి నిద్రలేదు.

అప్పట్నుంచీ ఆమెను 'ముసి ముసి దెయ్యం' అనుకోవడం ప్రారంభించాడు.

★★★

అరగంట నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఇంటి ముందంతా బురద బురద అయింది. వాకిలిలో ఒక పక్కగా తీసిన పాదుల నిండా, నీరు చేరి బయటకు కారుతోంది. వర్షం ధాటికి బయట రోడ్డు మీద రెండు మూడు చెట్లు నేలకూలాయి.

'శ్రీ సాయి చరణం మాకిక శరణం... శ్రీసాయి చరణం...మాకిక శరణం...అయ్యోయ్యో... చూడవే పాడు వర్షం...పాదులన్నింటిని తినేస్తోంది' సాయి నామాలు చదువుతూ కంగారుగా అంది అమ్మ.

పరీక్షలకు చదువుకుంటున్న హరిప్రియ తలెత్తి బయటకు చూసింది. బయటంతా వాన హడావుడి చేస్తోంది. చూరు మీద నుంచి చినుకులు టపాటపా రాలుతున్నాయి. ఆమె బాధగా మళ్లీ పుస్తకంలోకి తలపరికించింది. ఆమెకు వర్షం అంటే చాలా ఇష్టం.

వర్షం పడినప్పుడే ఈ పాడు పరీక్షలు పెట్టాలా. పైగా బీటెక్కు. వద్దన్నా ర్యాంకొచ్చి కొంప ముంచింది. పోనీ వర్షమైనా ఓ వారం తర్వాత పరీక్షలైపోయాక రావచ్చు కదా.

"ఈ మనిషి ఆఫీసుకి సరిగ్గా వెళ్లారో లేదో. వర్షం వచ్చేలా వుంది. గొడుగు తీసుకెళ్లండి అంటే విన్నారు కాదు. శ్రీసాయి చరణం మాకిక శరణం.. అయినా నా మాటలు ఆ చెవులకి అన్తేనా? వర్షానికి వాకిలంతా బురద బురద అవుతోంది. ఈసారయినా గచ్చు వేయించమని అడుగుదాం అన్నా... గచ్చెందుకే అమ్మాయి ఎంచక్కా మట్టిలో ముగ్గులేస్తొంటే అంటారు. శ్రీసాయి చరణం....మాకిక శరణం.... నేచెప్పేది ఒక్క ముక్కయినా ఎక్కుతోందా? ఆ మనిషికి? చూడు ఇంకాసేపాగితే ఆ రోడ్డు మీద నీళ్లు కూడా లోపలకొస్తాయి. ఈ హైదరాబాద్ రోడ్ల మీద నీళ్లల్లో లేని దరిద్రం వుండదు" అమ్మ నాన్ననీ, సాయినామాన్నీ, తననీ, హైదరాబాద్‌నీ అందరినీ ఒకేసారి కవర్ చేస్తోంది.

ఆమె పెన్ను తీసి ఏదో రాయబోతుండగా... పై కప్పు మీది పెంకుల సందులోంచిరాలిన నీటి బొట్టొకటి టప్‌మని పుస్తకం మీద పడింది. ఆమె ఆనందంగా పైకి చూసింది. ఇంకో రెండు పెంకులు పగిలిపోతే బావుండు. ఇంకో నాలుగు బొట్లు రాలితే బావుండు. అసలీ పరీక్ష లేకపోతే బయటకెళ్లి ఏకంగా వర్షంలోకి దూరదూ...

"అయ్యో...అయ్యో... చూడవే... మన తులసమ్మ వర్షానికి ఎలా వణికిపోతోందో" గాభరాగా అంది అమ్మ. కోటలో గాలికి ఊగిపోతున్న తులసిని చూసి ఆవిడ కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి.

ఒక్క ఉదుటున లేచింది హరిప్రియ. పరుగెత్తుతూ వెళ్లి చూసింది. వానకీ, గాలికీ తులసి చెట్టు ఒక పక్కకి వంగిపోయింది. ఆమెకు కంగారొచ్చింది. ఏం చేయాలో తోచలేదు.

అమ్మ తను లేవడం చూసి "ఒసేవ్ నువ్వు లేచావేమిటే పరీక్షలకి చదువుకోకుండా" అంటూ ఏవో అంటోంది. ఆమె వినలేదు. ఏదో స్ఫురించినట్లు లోపలకి పరిగెత్తింది.

ఆవిడ క్షణం పాటు అక్కడే నిలబడి తులసి చెట్టుకి తాడేమైనా కడితే బావుంటుందనిపించి లోపలకొచ్చి తాడుని తీసుకొచ్చింది. తెచ్చి చూసేసరికి తులసి కోట దగ్గర గొడుగు పట్టుకొని వుంది హరిప్రియ. గాలివాటానికి తగ్గట్టుగా పట్టుకుంది గొడుగుని. తులసికి గొడుగుంది. ఆమెకి లేదు. వర్షంలో తడుస్తూ ఒక చేత్తో గొడుగు పట్టుకుని మరో చేత్తో అటు తిరిగి ఏదో చేస్తుండడం చూసి "ఏం చేస్తున్నావే" అంది ఆవిడ.

"తులసికి చలేసి వణుకుతోంది కదా.. వెచ్చగా సాంబ్రాణి వేస్తున్నా" అంది హరిప్రియ గిన్నెలో ఇంకో రెండు సాంబ్రాణి ముక్కలు వేస్తూ...

గొడుగు కింద సాంబ్రాణి పొగ మధ్య తులసమ్మ. కోటలో మహారాణిలా ఠీవిగా నిల్చుని వుంది. ఆవిడ క్షణం పాటు లోకాన్ని మరిచి చూసింది. అంతలోనే తేరుకొని "ఒసేవ్... ఒసేవ్... పరీక్షలు పెట్టుకొని వర్షంలో తడుస్తూ ఈ సాంబ్రాణి సీనేంటే తల్లీ.... పద లోపలికి. తులసికి నేను తాడు కడతాలే. నువ్వు పద" అంది. ఆమె కదలకపోవడం చూసి ఆవిడే బయటకు నడిచి ఆమె చేయి పట్టుకొని "పదమ్మా జలుబు చేస్తుంది. అసలేపరీక్షలు" అంటూ లోపలకి తీసుకెళ్లింది. ఈ పరీక్షలయ్యేదాకా బయటకు కాలు పెట్టావంటే కాళ్లు విరగ్గొడతా... హన్ని....శ్రీసాయి చరణం... మాకిక శరణం..."

దూరం నుంచి ఇదంతా గమనిస్తున్న రెండు కళ్లు ఆమె లోపలికెళ్లడం చూసి నిరాశగా వెనుతిరిగాయి.

★★★

ఆ తరువాత రెండురోజుల పాటు ఆమె కని పించలేదు. మూడోరోజు సాయంత్రం గుడిలో కని పించింది.

"హలో..." అని పిలిచాడు వశిష్ట.

ఎవరో గంట కొట్టగానే గోపురం మీది పక్షులు గుంపుగా పైకి లేచాయి. ప్రదక్షిణం చేస్తున్నదల్లా ఆగి వెనక్కు తిరిగి చూసింది. అక్కడున్న వశిష్టని చూసి తననెందుకు పిలిచాడో అర్థం కాక ఏం కావా లన్నట్లు చూసింది.

"అదీ... ఆఁ.." తడబడి " ఇంకా ఎన్ని ప్రదక్షి ణాలు వున్నాయి" అన్నాడు.

ఆమెకు అర్థం కాక "ఎందుకు మీకు" అంది.

"అహ.. ఏం లేదు. మీతో కొంచెం మాట్లా డాలి. ముందు మీ పని అయిపోతే" నసిగాడు .

"ఇంకా ఆరున్నాయి" అంది.

"సరే... అక్కడ పక్కన కూర్చుంటాను" అన్నాడు. ఆమె తల ఊపి ముందుకు కదిలింది. ఆమె ప్రదక్షిణలు పూర్తి చేసి వచ్చేదాకా అక్కడే కూర్చుని ఏమేం మాట్లాడాలి అన్నీ ప్రిపేర్ అయ్యాడు. ఆమె వచ్చేసరికి లేచి నిలబడి 'నమస్తే' అన్నాడు.

"నమస్తే"

"అలా నడుస్తూ మాట్లాడుకుందాం" అన్నాడు.

"పదండి."

ఇద్దరూ నడవసాగేరు. "నాపేరు వశిష్ట" అంటూ ప్రారంభించి తన వృత్తి, ఎక్కడ వుండేది లాంటివి చెప్పాక "మీ పేరూ.." అన్నాడు.

"నా పేరు హ..హ.."

"హాసిని నా" అదేదో సినిమా గుర్తొచ్చి అడి గాడు.

"హచ్.." అని తుమ్మింది. "హ...హ..హచ్.."

"జలుబు చేసినట్లుంది" అన్నాడు.

"అవును."

"వర్షంలో బాగా తడిస్తే అలాగే అవుతుంది. మూడురోజుల క్రితం వర్షంలో బాగా తడిసిన ట్టుంది" అన్నాడు.

అతడంత ఖచ్చితంగా చెప్పేసరికి ఆమె కొంత ఆశ్చర్యంగా "మీకెలా తెలుసు?" అంది.

అతడికి ప్రారంభించడానికి మంచి పాయింట్ దొరికింది.

"మీరు వర్షంలో తడవడం నేను చూశాను." అంటూ ప్రారంభించాడు. "అదే కాదు.. మీరు రోజూ ఇంటి ముందు ముగ్గులేయడం-పుస్తకం పట్టుకొని అటూ ఇటూ నడుస్తూ చదువుకోవడం-రోజూ ఉదయం మీ నాన్నగారు ఆఫీసుకి వెళ్లేట ప్పుడు గేటుదాకా తోడు వెళ్లి టాటా చెప్ప డం-అప్పుడప్పుడు బయటకొచ్చి బుంగమూతితో కూర్చుని చేసే అలక-రోడ్డు మీది కుక్క పిల్లలకి బిస్కెట్లు వేయడం..." చెప్పుకుపోతుండగా ఆపి

"... ఇవన్నీ మీరెలా చూశారు?" అంది ఆశ్చ ర్యంగా.

అతడు చెప్పాడు. అయిదేళ్లుగా తను కిటికి లోంచి ఆమె ఎప్పుడు బయటకొస్తుందా? వస్తే బావుండు అనుకుంటూ పిచ్చిగా ఎదురు చూడడం - మూగప్రేమపేరు తెలుసుకోవాలని చేసిన ప్రయత్నం- ఆ తరువాత బర్త్‌డే పార్టీలో కలవ డం-ముగ్గమ్మాయి...ముసి ముసి దెయ్యంపేర్లూ...

వింటుందల్లా "చాలా ఆశ్చర్యంగా వుంది. నన్ను ఇంతలా ఒక అబ్బాయి గమనిస్తున్నాడన్న ఊహ కూడా ఎప్పుడూ రాలేదు. ఇదంతా వింటుంటే గర్వపడాలో, కోప్పడాలో, ఆనందించాలో, బాధపడాలో అసలు ఏం అనాలో కూడా అర్థం కావడం లేదు. అయినా అయిదేళ్లు మైగాడ్. ఎందుకింత కాలం? ముందే వచ్చి మాట్లాడొచ్చు కదా అంది.

ఆమె తన మాటలు నమ్మడం లేదేమో అన్న అనుమానమొచ్చింది. కానీ ఆమె ముఖంలో అలాంటిదేమీ కనిపించలేదు. "మీకు-మీకు కోపం వచ్చింది కదూ. మీరు నన్ను నమ్మడం లేదు కదూ " అన్నాడు.

"ఛ...ఛ. అలాంటిదేమీ లేదు" అంది నిజంగానే. " ఇదంతా వింటుంటే నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. అయినా ఇందులో కోప్పడా ల్సింది ఏముందతి? మీరు నాతో సంస్కార వంతంగా మాట్లాడారింతసేపూ..నాకు కోపం ఎందుకొస్తుంది?" అని ఇంగ్లీషులో అంది.

అతడికి ఎందుకో పట్టలేని సంతోషం కలిగింది. ఇంతకాలంగా కేవలం 'చూడడం'ద్వారా పెట్టు కున్న అభిప్రాయం వేరు. కానీ ఇప్పుడామ్మాయి ఎంతో ఉన్నతంగా దగ్గర దానిలా అనిపిస్తోంది. తన గురించి చెప్పగానే 'యూ ఇడియట్-నాకే సైట్ కొడతావా-గెటావుట్' అంటూ చీదరించుకో కుండా కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వడం చాలా గొప్ప విషయం.

ఇంతలో ఆమె అంది. "...కానీ అంత దూరం నుంచి కేవలం చూడడం" ద్వారా ఇంత ఫీలింగ్ ఎలా పెట్టుకున్నారు? నాకెందుకో అందులో అంత 'ఇంటెన్సిటీ' ఏమీ కనిపించడం లేదు. యాజ్ ఏ మ్యాటర్ ఆఫ్ ఫ్యాక్ట్, ఇంతదాకా మీకు నా పేరు కూడా తెలీదు. ఆ అమ్మాయీ ఈ దెయ్యం అను కుంటూ వున్నారు. ఇప్పుడు మీరు ఆ బర్త్‌డే పార్టీ గురించి చెపుతోంటే గుర్తొస్తున్నాయ్ తప్ప మీ గురించి నాకూ ఏమీ తెలియదు. ఇలా అడుగుతు న్నాని మరోలా అనుకోవద్దు. మీకు ఇంత కాలం 'టైం వేస్ట్ చేస్తున్నాను' అన్న ఫీలింగ్ ఎప్పుడూ కల గలేదా?" అంది.

అతడు మాట్లాడలేదు.

"చెప్పాను కదా హర్ట్ అవద్దు అని" అంటూ ఏదో అంటుంటే "ఛ... అలాంటిదేమీ లేదు" అన్నాడు.

"అందుకే అన్నాను" అంది-"అయిదేళ్లు ఎందుకు టైమ్ వేస్ట్ చేసుకోవడం? ఇప్పుడు మాట్లాడిందేమిటో అప్పుడే మాట్లాడాల్సింది."

"కానీ ఏం ముఖం పెట్టుకొని మాట్లాడగ లను? అప్పటికి నేనింకా స్టూడెంట్‌ని. ఉద్యోగం లేదు. కనీసం యూజీ కూడా అవలేదు. ఏం సపోర్ట్ చూసుకొని మాట్లాడగలను? మీ ఇంట్లో కాదు...మా ఇంట్లో చెప్పినా నన్నే తన్నేవాళ్లు. తాడు బొంగరం లేకుండా ప్రేమ,పెళ్లి అని మాట్లా డేయడానికి నేనేమీ తెలుగు సినిమా హీరోని కాదు" అన్నాడు.

"ఓహో అయితే ఇదంతా 'పెళ్లి' గురించి చెపు తున్నారా?" నడుస్తున్నదల్లా ఆగి అతని వైపు చూసింది.." అయితే వినండి-నాకు ఆల్రెడీ పెళ్ల యిపోయింది" అంది.

వెయ్యి వోల్టుల విద్యుత్ ప్రవహించినట్లు షాక్ అయ్యాడు. "మీకు..మీకు.." నోట మాట పెగ ల్లేదు. ఎన్నాళ్లగానో కట్టుకున్న సౌధం కళ్ల ముందే కుప్పకూలిపోయిన భావన...రాయిలా నిల్చున్న అతన్ని చూసి ఫక్కున నవ్విందామె.

"ఫీలవకండి... ఊరికే... అన్నాను."

"ఊరికినే... ఊరికినేనా...దెయ్యం..రాక్షసీ..." అప్రయత్నంగా బయటకు అనేశాడు కచ్చగా.

"ఏయ్-దెయ్యం యేంటి దెయ్యం- ఇందాకే చెప్పాను గదా కొంచెం పొలైట్‌గా వుండమనీ" అంది. అతడు నాలిక్కరుచుకున్నాడు. కొద్దిసేపు మౌనం తరువాత ఆమె అంది.

"చూశారా? పెళ్లయిందని చెప్పగానే ఎంతలా షాకయ్యారో? మీరింకో ఆర్నెల్లు అలాగే కిటికీ లోంచి చూస్తూ తాడూ బొంగరం అనుకుంటూ వుంటే అదే అయ్యేది. యాసిడ్‌తో ముంచిన సొట్టలా అలా చూస్తూ కూర్చుంటే పనులవ్వవు మాస్టారూ. ఇప్పటికైనా ఇదంతా నాకు చెప్పడం ద్వారా మీరేం ఆలోచిస్తున్నారో నాకు తెలీదు. మీరే మైనా మాట్లాడాలనుకుంటే వెళ్లి మా నాన్నగారితో మాట్లాడండి. నాతో కాదు. ఎందుకంటే నాకోసం సంబంధాలు వెతుకుతున్నది ఆయన. నేనపు కాదు" అంది.

"అదీ నిజమే" అన్నాడు. "మాట్లాడతాను... ఆ రామాలయం వీధిలో మీ ఇల్లు?"

"ఇంకా రామాలయం వీధేమిటి? ఇల్లు మారి రెండురోజులయింది. ఆ రెండ్రోజుల నుంచి సైట్ కొట్టడం లేదా ఏమిటి?" చిలిపిగా అడిగింది.

"ఓ అదా సంగతి.. రెండ్రోజుల నుంచి కని పించకపోతే ఏమయ్యిందో-కొంపదీసి జలుబు చేసిందేమో అనుకున్నాను" అన్నాడు.

"అవును..కొంత మారాకే జలుబు చేసింది"

"మరి ఇప్పుడు ఎక్కడుంటున్నారు?"

ఆమె చెప్పింది. చెప్పి, "అయిదేళ్లంటున్నారు. ఇప్పటికైనా కొంచెం తొందరపడండి. ఎందుకంటే ఎల్లుండి బయల్దేరి మా నాన్న విజయవాడ వెళుతు న్నారు. అక్కడేదో సంబంధం వుంటే మాట్లాడడా నికి" అంది. "ఇది ఖచ్చితంగా ఫిక్స్ అవుతుందని మా వాళ్లందరూ ఫిక్సయిపోయారు" నవ్వింది.

అతని ముఖంలో ఆందోళన కనిపించింది. ఆమె టైము చూసి "అమ్మో లేటయిపోయింది. అమ్మ చంపేస్తుంది. నేనిక ఉంటాను" అనేసి అక్క డ్నుంచి వడివడిగా కదలుతుండగా వెనుక నుంచి

''ఒక్క నిమిషం...'' అన్నాడు. ''మీ పేరు?''

వెళుతున్నదల్లా ఆగి వెనక్కు తిరిగింది.

''ఆల్రెడీ ఇచ్చాను. వచ్చి అది పెట్టినాయన్ని కనుక్కోండి'' అంతదాకా వుందిగా ముసి ముసి దెయ్యం'' ఫక్కున నవ్వేసి వెళ్లిపోయింది.

''ఈ పిల్ల నిజంగా దెయ్యం'' అనుకున్నాడు వశిష్ట.

★★★

ఆ తరువాత అంతా కలలాగా జరిగిపోయింది. ఇద్దరి పెద్ద వాళ్లు మాట్లాడుకోవడం- వీళ్లకి అమ్మాయి, వాళ్లకి అబ్బాయి నచ్చడం-అతడు చేసుకున్న అదృష్టం ఏమిటంటే గంటలూ, నక్షత్రాలూ ఎక్కడా చిన్న తేడా రాలేదు. పైగా అతని ఐదేళ్ల విరహానికి జాలేసిందేమో. దివ్యమైన ముహూర్తం పదిరోజుల్లో వుందంటూ పెళ్లిని ఫిక్స్ చేసారు. ఆ పదిరోజుల కాలం క్షణం తీరిక లేకుండా-హడావుడిగా కళ్లు మూసి తెరిచేలోగా అయిపోయింది. కిటికీలోంచి చూసే రోజుల్లో యుగల్లా గడిచిన క్షణాలకీ, క్షణంలా గడిచిన ఈ పదిరోజుల కాలానికీ అసలు పొంతనే లేదు.

ఏమైతేనేం. పెళ్లి చాలా ఘనంగా జరిగింది. హనీమూన్‌కి ఊటీకి కూడా వెళ్లొచ్చారు.

అయితే- ఆ తరువాత ఒక రోజు...

★★★

ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోగలగడం చాలా గొప్ప విషయం. తెలిసీ తెలియని వయసులో ప్రేమలో పడి, సినిమాహీరోలా ఫీలయిపోయి చదువుని, జీవితాన్ని పాడుచేసుకోవడం చాలా దుర్భరమైన విషయం.

కానీ తను అలా కాదు. సంయమనం పాటించాడు. ముందు నుంచి ఉద్యోగాన్ని, జీవితంలో సెక్యూరిటీని సాధించి అయిదేళ్లుగా మూగగా చూసి- ఇష్టపడిన అమ్మాయినే తన స్వంతం చేసుకున్నాడు.

అతడికి ఆరోజు మళ్లా మంచి కల వచ్చి ఉదయాన్నే నిద్ర లేచాడు. లేవగానే పాత జ్ఞాపకాలన్నీ దొంతర్లుగా మనసుని చుట్టుముట్టాయి. కళ్లు నులుముకుంటూ కిటికీ వైపు చూశాడు.

తనకెంతో ఇష్టమైన కిటికీ. తన మనసులోని మూగభావాలన్నింటిని ఒక స్నేహితుడిలా మౌనంగా పంచుకున్న కిటికీ... ఈ మధ్య అటు వెళ్లడమే తగ్గిపోయింది. రోజూ కాలేజీ. సమయం చిక్కినప్పుడల్లా కూడా భార్యే లోకమైపోయింది.

కిటికీ తెర తీసి పాత పెంకుటిల్లు వైపు చూశాడు.

అక్కడ కనిపించిన దృశ్యం చూసి ఉన్న మత్తు దిగిపోయింది. ఇది కలా? నిజమా? అన్నట్లు కనులు మరోసారి నులుముకొని చూశాడు.

నిజమే...

హరిప్రియ వాకిట్లో పొందిగ్గా కూర్చుని ముగ్గు లేస్తోంది.

అతడికి అర్థం కాలేదు. తన భార్య అక్కడ ముగ్గులేయడం ఏమిటి?

ఏదో అనుమానమొచ్చి ''ఒరేయ్...పద్దు.. పద్మా... ఒసేవ్ దెయ్యం..'' అని పిలిచాడు.

''ఆఁ...వస్తున్నా... ఏమిటా అరుపులు?'' బారెడు జడను వెనక్కు వేసుకుంటూ కాఫీ కప్పుతో వచ్చింది పద్మావతి.

తన భార్య ఇక్కడే వుంది. అతడు అటూ ఇటూ మార్చి మార్చి చూశాడు.

నిజమే...తన పద్దు ఒక్కడే వుంది కదా... మరి ఆ అమ్మాయెవరు?

అతనికేదో అర్థమయినట్లు అనిపించసాగింది.

''పొద్దున్నే ఏమిటా వెర్రి చూపులు?'' అంది పద్మావతి.

అతడు ఆమెను కిటికీ దగ్గరకి తీసుకొచ్చి ఆ పెంకుటిల్లు చూపించి, ''మీరు ఇంతకు ముందున్నది ఈ ఇంట్లోనే కదా?'' అన్నాడు.

మొట్టికాయలు వేసింది. ''అయిదేళ్లు సైట్ కొట్టిన ప్రబుద్ధులు మీరేనా? ఈ ఇల్లేమిటి? అది కదా?'' అంటూ అదే వీధిలో మరో మూల వున్న ఇంటిని చూపించింది. ''ఏమిటి?పొద్దున్నే జోక్స్ మొదలెట్టారు మాస్టారు?''

అతడికి ఇప్పుడంతా అర్థమైపోయింది.

అంటే..అంటే...

తను అయిదేళ్లుగా కిటికీలోంచి చూసిన అమ్మాయి వేరు. పద్దు వేరు... అంటే తను అప్పుడు బర్త్‌డే పార్టీ చూసిన పద్మావతినే ఈ ముగ్గమ్మాయి అనుకొని....

ముగ్గమ్మాయిని...తన ముసి ముసి దెయ్యం... వే...రు..

''ఏమైంది?'' అంది.

అతడు మాట్లాడలేదు.

తాను ఆ ముగ్గమ్మాయిని ఇంతదాకా కనీసం దగ్గరగా చూ..డ..లే...దు... ఆమె అతన్ని తన వైపు లాక్కుని ''ఏమిటండీ? ఏమైంది?'' అంది.

అతడూ ఆ షాక్ నుంచి ఇంకా కోలుకోలేదు. ఏదో లోకంలో వున్నవాడిలా కదిలి '' ఏమీ అవలేదు. మనం అర్జంటుగా ఈ కిటికీకి బ్లైండ్స్ కొట్టి మూసేయాలి'' అంటూ ఆమె పొడవాటి జడను తన మెడ చుట్టూ వేసుకున్నాడు.

''ఏమిటిది? నేనేదో మిమ్మల్ని నా జడతోనే కట్టిపడేసినట్లు..''

''జడల దెయ్యం... ఇక్కడో ముద్దు పెట్టవే...ప్లీజ్..'' అంటూ తన కనులు లమూశాడు వశిష్ట.

★



# పోటీ మంచిదే!

ఏ రంగంలోనైనా పోటీ మంచిదే. మంచి ఫలితాలు సాధించడానికి ఈ పోటీ దోహదపడుతుంది అంటోంది అమీషాపటేల్. చిత్రాల్లో నటించాలని ఏం లేదు. ఖాళీగా ఉంటే ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేస్తాను. ఆఫర్ల కోసం ఎవరి చుట్టైనా తిరగడం అంటే నాకెంతో చికాకు. నా ప్రతిభని గుర్తించి ఆఫర్ వస్తే ఆలోచిస్తాను. మీడియా అంటే నాకెంతో గౌరవం' అంటూ సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చింది అమీషాపటేల్.